
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 139 వ భాగం

## సూర్య వంశం – 7; మాంధాత

క్రితం వ్యాసం లో సూర్యవంశం మాంధాత వరకూ వచ్చిందని చదివాం కదా. ఇక్కడనుంచి మరో మలుపు, ఆయన కూతుర్లు ఏమయ్యారు అనేది చూద్దాం. ఆ కాలంలో సౌభరి అనే ముని ఉండేవాడు. ఈ సౌభరి మహర్షి కథ మరోసారి కృష్ణావతారంలో వస్తుంది. ఈయన గరుడుడికి శాపం ఇస్తాడు చేపలరాజు ఏడుస్తూ చెప్తే; ఈ మడుగులో మరోసారి నాగులనీ చేపలనీ తింటే చచ్చిపోతావు అని. అందుకే కాళీయుడు అక్కడ చేరతాడు. కృష్ణుడు కాళీయుడితో చెప్తాడు ఈ సంగతి, 'ఇక్కడనుంచి సముద్రానికి వెళ్ళిపోండి. నీ పడగలమీద నా పాద ముద్రలు చూసి గరుడుడు నిన్నేమీ చేయడు' అని. ఓ సారి ఈ సౌభరి మహర్షి యమునా నదిలో స్నానం చేస్తూంటే మనసు కలత బారింది.

సీ. యమునాజలములోన నధికుఁడు సౌభరి
తపము చేయుచు జలస్థలమునందుఁ
బిల్లలుఁ దన ప్రాణవల్లభయును గూడి
మెలఁగ నానందించు మీనరాజుఁ
గనుఁగొని సంసారకాంక్షియై మాంధాత
నొక కన్య నడుగ నృపోత్తముండు
దరుణి నిత్తును స్వయంవరమునఁ జేకొను
మనవుడు "ననుఁ జూచి యౌవనాంగి [9-173]

ఆ. యేల ముసలిఁ గోరు నిట్టట్టు వడఁకెడి
వాఁడఁ జాల నరసినాఁడ నొడల
జిగియు బిగియు లేని శిథిలుండఁ గరఁగింప
బాలఁ దిగిచికొను నుపాయ మెట్లు? [9-173.1]

చేపలు గుంపుగా వెళ్తోంటే 'ఆహా సంసారం ఉంటే ఎంత సంతోషం, పిల్లలూ భార్యా ఉంటే హాయి కదా?' అనిపించి మనసు కలతబారితే మాంధాత దగ్గరికి వెళ్ళి నాకు మీ కూతుర్లలో ఒకావిడని ఇచ్చి పెళ్ళి చేయండి అని అడిగాడు. మాంధాత ఆలోచించాడు, ఈయనకి కూతుర్ని ఇవ్వనూ అంటే శపిస్తాడేమో అని భయం. ఇవ్వాలంటే ఈయన అసలే ముసిలివాడు కదా చూస్తూ చూస్తూ యవ్వనంలో ఉన్న కూతుర్లని ఇవ్వడం ఎలా? అందుకని ఓ ఉపాయం ఆలోచించాడు. చివరకి వెళ్ళి చెప్పాడు ఆయనతో – నా కూతుర్లని అడుగుతాను. వాళ్ళు వప్పుకుంటే తప్పకుండా ఇస్తాను అని.

ఇది సౌభరి మునికి అర్థం అవడం ఎంతసేపు? ఆయనకూడా ఆలోచించాడు.

ఆ. బాల పువ్వుఁబోడి ప్రాయంపు వానిని
జెన్నువాని ధనము జేర్చువాని
మరిగెనేనిఁ గొంత మరుగుఁగా కెదిరిఁ ద
న్నెఱిఁగి ముసలితపసి నేల మరుగు? [9-175]

వ. అని విచారించి సౌభరి దన తపోబలంబునం జేసి ముసలితనంబు విడిచి యెల ప్రాయంపుఁ గొమరుం దయి యలంకరించుకొని ముందట నిలువంబడిన మాంధాతయుఁ గన్నియల నగరు గాచికొని యున్నవారికి సెలవు జేసిన వా రమ్మునీంద్రుని నా రాజపుత్రిక లున్న యెడకుఁ గొనిపోయి చూపిన. [9-176]

యవ్వనంలో ఉన్న వారినీ డబ్బులు ఉన్నవారినీ అమ్మాయిలు పెళ్ళిచేసుకుంటారు కానీ ముసలివాణ్ణి చేసుకోరు కదా అందువల్ల ఆయన తన తపశ్శక్తి చేత యవ్వనంలో ఉన్న కుర్రాడిగా మారి అలంకరించుకుని

మాంధాత దగ్గిరకి వచ్చి 'నడు పోదాం, నన్ను చూసి మీ అమ్మాయిలు ఏమంటారో అడుగుదాం' అన్నాడు. ఇద్దరూ కలిసి వెళ్ళారు మాంధాత కూతుర్ల దగ్గిరకి.

ఉ. కోమలులార! వీఁడు నలకూబరుఁడో; మరుఁడో; జయంతుఁడో;
యేమఱి వచ్చె; వీనిఁ దడవేల వరింతుము నేమ యేమ" యం
చా మునినాథుఁ జూచి చలితాత్మికలై సొరదిన్ వరించి రా
భామిను లందఱుం గుసుమబాణుఁడు గీ యని ఘంట వ్రేయఁగన్. [9-177]

మాంధాత ఈయన్ని తీసుకెళ్ళి చూపించి 'ఈయన నలకూబరుడో, జయంతుడో ఇలా అదమరచి వచ్చినట్టున్నాడు, ఈయన్ని వరిస్తారా?' అని అడిగాడు. ఈయన్ని చూసి వాళ్ళందరూ నేను చేసుకుంటానంటే నేను చేసుకుంటాను అని ముందుకొచ్చాక వాళ్ళందర్నీ ఇచ్చి పెళ్ళిచేసాడు. విశ్వామిత్రుడు మేనకని చూసి తపస్సు వదిలేసి శకుంతల పుట్టేదాకా ఇలాగే చేసాడు కదా? ఇదే సౌభరి మహర్షికి కూడా జరిగింది. అయితే కొన్నాళ్లకి కళ్ళు తెరుకున్నాయి.

క. పెక్కండ్రు రాజముఖులకు
నొక్కఁడు మగఁ డయ్యుఁ దనియకుండె మునీంద్రుం
డెక్కుడు ఘృతధారలచే
నక్కజమై తృప్తి లేని యనలుని భంగిన్. [9-180]

అంతమంది భార్యలకి ఒక్కడే మొగడు కనక అందరితో సుఖంగా ఉన్నా నేతి ధారలు (ఘృత ధారలు) ఎంతపోసినా తృప్తి చెందని అగ్ని లాగా (అనలుడు) సంసారంలోనే ఉన్నాడు. ఇంద్రియ వాంఛలు తృప్తి చెందడం అన్నది ఏనాటికీ జరిగేది కాదు కదా?

వ. అంతఁ గొంతకాలమునకు బహుభార్యాచర్యుండగు సౌభరి యేకాంతంబునఁ దన్నుఁ దాన చింతించుకొని, మీనమిథున సంగదోషంబునం గాఁపురంబు దనకు నగపడుట యెఱింగి, పశ్చాత్తాపంబున నిట్లనియె.
[9-185]

కొంతకాలం గడిచాక అసలు విషయం తెల్సింది. అయ్యో ఇంతకాలం నేను తపశ్శక్తి వృధా చేసుకున్నాను కదా అని పశ్చాత్తాపం చెందాడు. ఇదంతా కలిగింది చేపలు అన్నీ ఒకేసారి గుంపుగా ఈదుతూ వెళ్ళడం చూసే కదా? ప్రస్తుతం తనలో తాను అనుకుంటున్నాడు

మ. ఉపవాసంబుల డయ్యుటో? విషయసంయోగంబు వర్జించుటో?
తపముం బూని చరించుటో? హరిపదధ్యానంబునన్ నిల్చుటో?
యపలాపంబున నేల పొందితి? హతంబయ్యెం దపంబెల్ల నీ
కపటస్త్రీపరిరంభముల్ మునులకుం గైవల్య సంసిద్ధులే? [9-186]

ఉపవాసాలు చెయ్యడం, విషయవాసనలు వదులుకోవడం, తపస్సు చేయడం ఇవన్నీ శ్రీహరిని ఆశ్రయించడానికే కదా? అయినా నాకు ఈ స్థితి ఎలా వచ్చింది? ఉన్న తపశ్శక్తి అంతా హరించుకు పోయింది (హతంబయ్యె) ఈ పెళ్ళితో, స్త్రీ సంగమంతో. ఇలా చేస్తే కైవల్యం ఎలా వస్తుంది?

చ. మునినఁట; తత్త్వవేదినఁట; మోక్షమకాని సుఖంబులెవ్వియుం
జనవఁట; కాంత లేఁబదట; సౌధచయంబఁట; వాసదేశముం,
దనయులు నైదువేలఁట; నిదానము మీనకుటుంబి సౌఖ్యముం
గనుటఁట; చెల్లరే! నగవుగాక మహాత్ములు చూచి మెత్తురే? [9-187]

నేను మునిని, తత్వం తెల్సినవాడిని, మోక్షం తప్ప మరేమీ వద్దనుకున్నవాడిని. అయినా యాభై మంది భార్యలు, ఐదువేల మంది కొడుకులు. ఇదంతా ఎందుకంటే చేపలని చూసి సంసారం ఎంత బాగుంటుందో అనే చిత్త చాపల్యం కలగడం చేత. ఇదంతా ఎవరైనా మహాత్ములు చూస్తే నవ్విపోతారు గానీ మెచ్చుకుంటారా?

వ. అని దుఃఖించి, తన్నుం దాన నిందించుకొని, తన వేదబంబు వివేకించుచు, నిహపరసాధకుండై,
కాపురంబువిడిచి, సతులుం దానును వానప్రస్థధర్మంబున నడవికిం జని, ఘోరతపంబు జేసి, శరీరంబు
గుదియించి, యగ్నిసహితుండై, పరబ్రహ్మంబు జొచ్చె; నంత. [9-189]

దుఃఖంతో ఇదంతా భార్యలకి చెప్పి వారితో పాటు అన్నీ విడిచి వానప్రస్థానికి వెళ్ళాడు. అక్కడ అడవిలో ఆయనా ఆయన భార్యలు తపస్సుచేస్తూ పరబ్రహ్మాన్ని చేరుకున్నారు. ఇది మాంధాత కూతుర్ల సంగతి. రాముడు మాంధాత కొడుకుల సంతతిలో వాడు. ఆయన కథ ఇంకా చాలా తరాలకి కానీ మొదలవదు. ప్రస్తుతానికి వస్తే మాంధాత మొదటి కొడుకు అంబరీషుడు. ఈయన సంగతి వేరే. రెండో కొడుకు పురుకుత్సుడు. ఈయన నుండి అనరణ్యుడు, మరికొన్ని తరాలు గడిచాక సత్యవ్రతుడు అనేవారు కలిగారు. వీళ్ల గురించి కొంచెం కథ చెప్పుకుని ముందుకి కదులుదాం.

రావణుడు అనరణ్యుడి మీదకి యుద్ధానికి వెళ్ళి, ఆయన తలని వేయి బాణాలు పెట్టి కొట్టాడుట రావణుడు. నేలమీద కూలబడి చచ్చిపోయే అనరణ్యుడి దగ్గిరకి గర్వంగా వెళ్ళేసరికి ఆయన రావణుడికేసి సాలోచనగా చూసి చెప్పాడుట,

*ఉత్పత్స్యతే కులే హ్యస్మిన్ ఇక్ష్వాకూణాం మహాత్మనాం*
*రాజా పరమతేజస్వీ యస్తే ప్రాణాన్ హరిష్యతి* *(రామాయణం ఉత్తర కాండ)*

*రాబోయే రోజుల్లో మా ఇక్ష్వాకుల కులంలో ఒక మహాత్ముడైన రాజు, మహాతేజస్వి పుట్టి నీ ప్రాణం తీస్తాడు. ఇది అనరణ్యుడు ఇచ్చిన శాపం కానీ, ఆయనకి పోయేటప్పుడు కనిపించిన చివరి దృశ్యం కానీ కావొచ్చు. అలా మొత్తానికి రావణుడు చావడానికి అప్పటికే బీజం పడినట్టి లెక్క. ఈ కథ అగస్త్యుడు రాముడితో చెప్తాడు యుద్ధాంతరం రాముణ్ణి అయోధ్యలో చూడ్డానికి వచ్చినప్పుడు. ఇక పోతే సత్యవ్రతుడి కథ మనకి బాగా తెల్సినదే. ఈ సత్యవ్రతుణ్ణే త్రిశంకుడనే పేరుతో పిలవడం; దానికో పెద్ద కథ ఉంది. ఈయన కథ స్థూలంగా ఇదీ. ఈయన కులగురువు వశిష్టుడు. ఆయన దగ్గిరకి చేరి నన్ను ఈ శరీరంతో స్వర్గానికి పంపండి అని అడిగాడు. ఆయన నేను చేయను పో అన్నాక మరోసారీ మరో సారి విసిగించడం మొదలు పెట్టేసరికి ఆయనకి కోపం వచ్చి శపించాడు – నువ్వెందుకూ పనికిరాకుండా ఛండాలుడివి అయిపోతావు అని. దాంతో ఈ సత్యవ్రతుడు విశ్వామిత్రుణ్ణి ఆశ్రయించాడు; వశిష్టుడికీ విశ్వామిత్రుడికీ శతృత్వం ఉందని తెలుసు కనక. ఈయన చేయలేని పని ఆయన చేస్తాడని ఆశ.*

సీ. గురుశాపవశమునఁ గూలి చండాలుఁడై
యనఘాత్ముఁ గౌశికు నాశ్రయించి;
యతని లావున దివిజాలయంబున కేఁగ
మన్నింప కమరులు మరలఁ ద్రోయఁ;
దల క్రిందుగాఁ బడి దైన్యంబుతో రాఁగఁ
గౌశికుఁ డెప్పటి ఘనత మెఱసి
నిలిపె నాకసమున; నేఁడు నున్నాఁడు త్రి
శంకుఁ; డాతఁడు హరిశ్చంద్రుఁ గనియె; [9-192]

తే. నా హరిశ్చంద్రుఁ గౌశికుఁ డర్థిఁ జేరి
యాగదక్షిణామిషమున నఖిలధనముఁ
గొల్లగొని మీఁదఁ గులహీనుఁ గొలువఁ బెట్ట;
బొంక కలజడిఁ బొందె నా భూవరుండు. [9-192.1]

ఈ విశ్వామిత్రుడి తపశ్శక్తితో *సత్యవ్రతుడు* స్వర్గారోహణం చేయబోయేసరికి ఇంద్రుడు కిందకి తోసేసాడు. విశ్వామిత్రుడు ఆయన్ని కిందపడకుండా ఆపి అక్కడే మరో స్వర్గం సృష్టించడం మొదలుపెట్టాడు. ఈయన భూమ్మీదా, స్వర్గంలోనూ ఉండడం కుదరకుండా అక్కడే మధ్యలో ఉండిపోయేడు. ఆయన పేరు మీదే అటూ ఇటూ కాని పనిని 'ఇదో త్రిశంకు స్వర్గం' అనడం పరిపాటి అయింది. ఈ త్రిశంకుడి కొడుకే హరిశ్చంద్రుడు. ఈయన కథ వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS